# దేశమంటే ?

దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్నాడు గురజాడ మహాకవి. అభ్యుదయ వాది - మట్టిలాంటి దేశంకంటే, మట్టి మీద బ్రతికే మనుషులు ముఖ్యమని, మానవత్వం అవసరమని ఆయన ఉద్దేశ్యం.

అన్ని అర్థాలకూ పెడర్థాలు కూడా చెప్పవచ్చు చెప్పడమేకాదు ఆచరణ కూడా జరిగిపోతుంది.

దరిద్రరేఖ క్రింద నలిగిపోతున్న సామాన్య జనం, మనుషులు కాబట్టి, ఆ మనుషుల కోసం తిరిగి ఇవ్వడానికి రాష్ట్రంలోని ప్రభుత్వ భూములు అమ్మేస్తామని ప్రభుత్వం సూచన చేయడం ఒక విచిత్రం.

భూములు అమ్మడం మొదలుపెడితే ఎటువంటి భూములు? చట్ట రీత్యా రాష్ట్రంలో భూమి అంతా ప్రభుత్వానిదే! ప్రైవేటు వ్యక్తులు ఆర్జించిన ప్రస్తుత భూమి పట్టాల ద్వారా ప్రభుత్వం ఇదివరలో ఇచ్చిందే.

ఆంధ్రదేశంలో చెప్పలేనంత భూమి సాగులేక పడివుంది కేరళ రాష్ట్రంలో ప్రతీ సెంటు భూమి సాగులోకి వచ్చేసింది వ్యవసాయ సంస్కరణలు కేరళలో వున్నంతగా ఇతర రాష్ట్రాలలో లేవు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గవర్నమెంటు భూములు అమ్మేస్తే కొన్ని వేల కోట్ల రూపాయలు రావడం తథ్యం. డబ్బంతా ప్రజల తిండి కోసమే అయితే అంతేముంది? భూములు అమ్మేస్తుంటారు- బియ్యం తినేస్తుంటారు ప్రజలు- చివరకు ప్రభుత్వానికి భూములు ఏం ఉంటాయి? ఆకలి అనంతం- భూములు పరిమితం- మొత్తం భూములు అమ్మేస్తే ఇంక మిగిలేదేముంది?రాజ్యం వుండదు ప్రభుత్వమూ ఉండదు!

అయితే ఈ భూములు ఎవరికి అమ్ముతారు! డబ్బున్న ధనికులకా? పార్టీ కార్యకర్తలకా? కోట్లు సంపాదించిన రాజకీయవేత్తలకా?- అంటే రాజ్యంలో సామంతరాజ్యాలు ఏర్పడతాయి అన్నమాట!

అసలు రెవిన్యూ శాఖ ఈ భూములను రక్షించలేకపోతోంది అంటే, కోట్ల రూపాయలు తింటున్న ఉద్యోగులు ఏం చేస్తున్నట్లు అసలు వారెందుకు ఏ పనీ చేయలేకపోతే? చేసే కబ్జాలు రాజకీయవేత్తలను ప్రభుత్వం అదుపు చేయలేకపోతే ప్రభుత్వ అధికారమెందుకు ?

పూర్వకాలంలో రాజులు రాజ్యం పరిపాలిస్తూ సామాన్యుని బ్రతుకు గురించి కూడా ఆలోచించేవారు. ప్రజల సుఖమే తమ సుఖంగా ఎంచే వారు. ఖజానాలోని సొమ్ము అవసరమైతే ప్రజలకే దానధర్మాలు చేసే వారు.

అసలు బియ్యంకోసం భూములు అమ్మేస్తే చందాలెందుకు? బియ్యం సరఫరా చేయడానికి డబ్బే ముఖ్యంకాదు కదా ! పంట పండాలి ! పంట నీ ఆధీనంలో వుండాలి ! ఆ పంట అంతా ప్రజలకు చవక ధరలో దొరకాలి ! అయినా చందాలద్వారా డబ్బు సంపాదిస్తే మాత్రం బియ్యం దొరకవద్దూ ?

కొన్ని లక్షలమందికి బియ్యం తక్కువ ధరకు అందచేస్తే పని అయిపోయిందా ? దాన్ని మంచి పాలన అంటామా ? తక్కిన కోట్ల మందీ ప్రజలు కారా ? వారికి వోటు లేదా ?

అసలు అందరినీ సమానంగా చూడాలని ప్రజాస్వామ్యం చెబుతుంది గదా ! ఈ విభేదాలు దేనికి ?

మరి ధరలు ఎందుకు తగ్గించరూ ? అందరికీ ఒకే తక్కువ ధరకు అన్ని వస్తువులు ఎందుకు సరఫరా చేయరు ? దానికి పరిపాలనా చట్టాలు ఏవీ లేవా ?

ఒక్కొక్క మనిషికి, ఎవరైతేనే బ్యాంకుల్లో లక్షలుకోట్ల రూపాయలు ఎందుకు. ఒక పరిమితి దాటితే ఆ ధనం ప్రభుత్వానిది కావాలి. జాతీయ అభివృద్ధి కార్యమాలకు వాడాలి ! అటువంటి చట్టం ఎందుకు రాదు ? అంటే పరిపాలకులకే ఇది చాలా ఇబ్బంది ! పరిపాలకులు, అధి

నేతలు, రాజకీయ వేత్తలు, వ్యాపారస్తులు, సినీప్రముఖులు - వీరే ధనిక వర్గం. మరి వీరి చేతిలోనే రాజ్యం వుంటోంది? అందువల్ల వారెందుకు తెస్తారు ఇటువంటి చట్టాలు !

ధనం వుంటే రాజ్యాధికారం వస్తుంది. రాజ్యాధికారం వుంటే ధనం వస్తుంది. ఇది ఒక అంతులేని గొలుసు.

మనుషుల సంగతి ఎవరికి కావాలి ? అధినేతలకే కావాలి ! వారిని, వారి గురించి నినాదాలను పణంగా పెట్టి అధినేతలు రాజ్యాధికారం పొందుతారు !

భూములన్నీ అమ్మేస్తే ధనం ఎక్కడ దాస్తారు. ఈ ధనమంతా సామాన్య ప్రజలకు తిండి పెట్టగలదా? తిండితోపాటు సామాన్యుడికి గుడ్డ, గుడిసె కూడా కావాలి కదా ! వాటికి నిధులు ఎలా ? చందాలు వసూలు చేస్తే ఇచ్చేది ధనికులే ! వ్యాపారస్తులూ, తదితరులూ. వారు ఎంతకాలం చందాలు ఇస్తారు. చందా పేరుమీద అధికార జులుంచేస్తే ? వారి గతేమిటి ?

దేశమంటే మట్టికాదోయి ! కనుక మట్టితో దేశానికి సంబంధం లేదని, భూములు అమ్మేస్తే, గురజాడ వారిని అనుసరించిన ఘనత మాది అని అభ్యుదయ నినాదం ఇచ్చినా ఆశ్చర్యం లేదు !

దేశమంటే మనుషులోయి- అంటే మట్టిలేనిదే మనుషులు ఎలా బ్రతుకుతారు ? మట్టినుంచి తిండి, తిండిద్వారా మనుష్యుల అభివృద్ధి కలుగుతుంది.

మనిషికి తిండి కావాలంటే మట్టి కూడా కావాలి. చివరకు రాగి లేక ఇనుమును ఆశ్రయిస్తాడు మనిషి.

ఈరోజు గురజాడ బ్రతికి వుంటేతన కవిత్వం కూడా మార్చేవాడే అనిపిస్తుంది.

దేశమంటే మనిషికాదోయ్
దేశమంటే మట్టి నిజమోయి ! అని. అందువల్ల అధినేతలు బంగారం లాంటి మట్టిని చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలి. ••